క్లుప్తంగా

ఘనంగా దత్త జయంతి వేడుకలు



చదలాడ ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దత్త జయంతిని ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆయా వీధుల్లో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భజన సంకీర్తనలు, శ్రీరామ, ప్రసన్నాంజనేయ స్వామి నామస్మరణతో గ్రామాలు, పురవీధుల్లో మార్మోగాయి. స్థానిక మెయిన్‌రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి, పలు ఆంజనేయ ఆలయాల వద్ద భక్తులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా చదలాడ ఆంజనేయ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా, ఆయా హనుమాన్ ఆలయాల వద్ద అన్న సంతర్పణలు చేశారు.

నలుగురు జూదగాళ్ల అరెస్టు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం శివారు మంగాయ్యమ్మ కాలనీలో పేకాడుతున్న శిబిరంపై ఆదివారం తెల్లవారు జామున పోలీసులు దాడి చేశారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23,070 స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళ్లూరులో ఏకాహం



తాళ్లూరులో కోలాటం గురువు శివరామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని తాళ్లూరు రామాలయంలో ఆదివారం ఏకాహం నిర్వహించారు. మండలంలోని పలు భజనా బృందాల సభ్యులు పాల్గొని నిరంతరాయంగా భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం గ్రామస్తులు కోలాటం గురువు నిమ్మలగడ్డ శివరామకృష్ణను పూలమాల, శాలువాతో సన్మానించారు.

2047కి ఆర్థిక శక్తిగా భారత్

పెద్దాపురం: రానున్న 2047 ఏడాది నాటికి భారతదేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చేందుకే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్రచార యాత్ర చేపట్టిందని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో పీఆర్‌డి రాజశేఖర్ మాట్లాడుతూ 2047 నాటికి మనదేశాన్ని ఆర్థిక శక్తికి నిలయంగా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. బీజేపీ నాయకులు తుమ్మల పద్మ, విత్తనాల వెంకటరమణ, దువ్వా శ్రీదేవి తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

దుస్తుల షాపు దహనం

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో రామలయం వెనుక శ్రీకాకులపు దుర్గకు చెందిన దుస్తుల షాపును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. శనివారం అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో కొందరు వ్యక్తులు షాపులోకి పెట్రోల్ పోసి దహనం చేశారు. షాపులోని దుస్తులు, ఫ్యాన్సీ వస్తువులు, చెప్పులు, జెరాక్స్ మెషీన్ తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. దీనిపై రౌతులపూడి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సర్పంచ్ సత్తిబాబు సూచించారు.

సీబీ దేవంలో కరోనా కలకలం

పెద్దాపురం: మండలం చినబ్రహ్మదేవంలో కరోన కలకలం రేపింది. ఆరు నెలల పసికందుకు కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో బాలుడికి, కుటుంబ సభ్యులు ఐదుగురిని హోం ఐసోలేషన్‌లో ఉంచి కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యులు ఉషా ప్రియదర్శిని ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహస్తున్నారు.



విద్యుత్తు అలంకరణలో సామర్లకోటలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి



పిఠాపురం క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన



ఉప్పాడలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఉప్పాడలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు క్రీస్తు జననం
- ముస్తాబైన ప్రార్థన మందిరాలు
- గ్రామాల్లో పండగ సందడి



తండ్రి, కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ చర్చిలో విద్యుత్ వెలుగులు



పిఠాపురంలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి



సామర్లకోటలో విద్యుత్తు దీపాలంకరణతో సెంటినరీ బాప్టిస్టు చర్చి



సామర్లకోటలోని సెంటినరీ అగస్టానా లూథరన్ చర్చి (సూది గుడి)

పిఠాపురం: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకొనేందుకు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని క్రైస్తవులు రెడీ అయ్యారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రార్థన మందిరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ప్రాంతాల్లో క్రిబ్ (పశువులపాక) పాకలను ఏర్పాటు చేసి బాల యేసు విగ్రహాలను నెలకొల్పారు. ఇప్పటికే క్రైస్తవులు తమ ఇళ్లపై రంగు రంగుల స్టార్‌లను ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ప్రార్థనాలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పిఠాపురంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, బేతెస్త బాప్టిస్ట్ చర్చి, ఇతర ప్రార్థనాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పిఠాపురం మండలం జల్లూరు బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీ చర్చిలో ఆదివారం క్రిస్టస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి.

సామర్లకోటలో..

సామర్లకోట: క్రిస్మస్ పర్వదినం సోమవారం రావడంతో ఆదివారమే చర్చిల్లో సందడి మొదలైంది. ఇళ్ల ముందు స్టార్లు ఏర్పాటు చేసుకుని, ఆర్థిక స్తోమత కొద్దీ విద్యుద్దీపాలంకరణలు చేసుకున్నారు. పిల్లలు క్రిస్మస్ తాత వేషాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ మండల పరిధిలో చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పట్టణ పరిధిలోని అతి పురాతనమైన సెంటినరీ అగస్థానా లూథరన్ చర్చి (సూది గుడి), ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, సాలెమ్ బాప్టిస్టు చర్చి, ఆర్‌సీఎం చర్చిలతో పాటు, మరో 75 చర్చిలు, మండల పరిధిలో 50 చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ సందర్భంగా అన్ని చర్చిలలో కేకులు కట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిల వద్ద, క్రైస్తవుల ఇళ్ల వద్ద క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసి విద్యుదలంకరణలు చేశారు.

ఆధ్యాత్మికతతో సేవాభావం అవసరం

పెద్దాపురం: ప్రతి వ్యక్తిలో ఆధ్యాత్మిక భావనతో పాటు సేవాభావం కూడా అవసరమని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు, రెవరెండ్ నంగిన సత్యానందం అన్నారు. విశ్రాంతి దిన ఆరాధనల్లో భాగంగా ఆదివారం క్రిస్మస్ వేడుకలను పురష్కరించుకుని రానున్న నూతన సంవత్సర ఎదుర్కోలు వేడుక సందర్భంగా మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లోని చర్చిలో విశ్వాసులకు సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు శామ్యూల్ సుదీప్ వస్త్రదానం చేశారు. ప్రభువు చూపిన ఆజ్ఞలను పాటించి చివరి వరకు తమ జీవతమనే పరుగు కడముట్టించాలన్నారు. పలు చర్చిల్లోని పేదలకు చీరలు పంపిణీ చేశారు. రాయవరపు వీరబాబు, పోలవరపు పైడిరాజు, కందా ప్రసాద్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

క్రిస్మస్ ఆరాధనలకు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చర్చిలు సిద్ధమయ్యాయి. పట్టణంలోని స్థానిక లూథరన్, బైబిల్ మిషన్, తండ్రి, కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ మందిరాలతో పాటు మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, పులిమేరు, జి.రాగంపేట పలు గ్రామాల్లోని చర్చిల్లో భారీ లైటింగ్, క్రిస్మస్ ట్రీ, నక్షత్రాలతో అలంకరించారు. ప్రతి చర్చిల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రార్థనలు చేసేందుకు దైవజనులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్, మూలపేట, పొన్నాడ, నాగులపల్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారుల వీధుల్లో నృత్య ప్రదర్శనలు చేశారు. ఉప్పాడ చర్చిలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కాగా సోమవారం క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థన మందిరాలను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని చర్చిల్లోనూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

కొత్తపల్లి: క్రీస్తు బోధనలతోనే ప్రపంచ శాంతి సాధ్యమని రాజమహేంద్రవరం హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి లక్ష్మీగౌతమి హేచరీ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. పాస్టర్ జాన్ వెస్లీ క్రీస్తు సందేశాన్ని అందించారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సుమారు 1000 మంది నిరు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఐక్య క్రిస్మస్‌కు హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్, గండ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న జాన్ వెస్లీ



హాజరైన క్రైస్తవులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పిఠాపురం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పిఠాపురం మండలం కుమారపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.17 కోట్లతో నిర్మించే వాటర్ టాంకుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పిఠాపురం మండలం జల్లూరులో జల జీవన్ మిషన్ నిధులు రూ.53.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జల్లూరు శివారు గోవిందరాజపురంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.72 లక్షలతో చేపట్టిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో రూ.22.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు.

విరవాడలో...

పిఠాపురం మండలం విరవాడలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.38.60 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.99 లక్షలతో నిర్మించిన కుళాయి కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.43 లక్షలతో నిర్మించనున్న వాటర్ టాంక్‌కు ఆయన శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు చేయూతను ఇస్తున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విరవాడలో కుళాయి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

రాజేశ్వరి సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: దివంగత మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పిఠాపురం పట్టణాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ అన్నారు. పిఠాపురంలో ఆదివారం దివంగత మున్సిపల్ చైర్ పర్సన్ రాజేశ్వరి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడిది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రాజారామ్మోహ రాయ్ మున్సిపల్ పార్క్ ఆవరణలో రాజేశ్వరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ రాజేశ్వరి చిన్న వయస్సులోనే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై రికార్డు సృష్టించారన్నారు. రెండోసారి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేస్తూ మృతి చెందారన్నారు. ఆమె అకాల మరణం పట్టణ ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జి, ఆనాల సుదర్శన్, బొజ్జా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో దివంగత మున్సిపల్ చైర్‌పర్సన్ రాజేశ్వరి విగ్రహానికి నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు, నాయకులు

ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. జాంధానీ చీరలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు తమ వాహనాలను కొత్తపల్లి యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలుపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ సెంటర్‌లో ఆదివారం రాత్రి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం క్రిస్మస్, ఆంగ్ల నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల నేపథ్యంలో జాంధానీ చీరలను కొనుగోలు చేసేందుకు స్థానికులే కాంకుండా ఇతర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో కొనుగోలు దారులు వస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి యూనియన్ బ్యాంకు వద్ద నిలిచిపోయిన వాహనాలు

రబీకి సన్నద్ధం

- మండలంలో 22,300 ఎకరాల్లో సాగు
- వెదజల్లు పద్ధతికే రైతులు మొగ్గు
- తుపాను వల్ల ఆలస్యం అవుతున్న పనులు

సామర్లకోట: ఇప్పటికే వరినాట్లు పూర్తి చేసుకోవలసి ఉండగా మిచాంగ్ తుపాన్ వల్ల వరి సాగు పనులకు అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలో ప్రస్తుత రబీ సీజన్‌లో 22,300 ఎకరాల్లో వరి సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు 14,500 ఎకరాలల్లో దమ్ములు చేసుకుని, 5,500 ఎకరాలల్లో వెదజల్లు పద్ధతిలోను, 30 ఎకరాల్లో ఇప్పటి వరకు నాట్లు వేసుకొని సాగు ప్రారంభించారు. ఇంకా 7,800 ఎకరాలల్లో పనులు ప్రారంభించాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. సామర్లకోట మున్సిపాలిటీతో పాటు పీబీ దేవం, జి.మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, ఉండూరు, హుస్సేన్‌పురం, అచ్చంపేట, కాపవరం, పి.వేమవరం, మాధవపట్నం గ్రామాలల్లో వరి కోతలు పూర్తి కాగా రైతులు రబీ పంటకు సిద్ధమయ్యారు. ప్రస్తుత రబీ వరి సాగులో భాగంగా వెదజల్లు పద్ధతికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కాగ ఖరీఫ్ వరి నాట్లు ఆలస్యంగా వేయడంతో నవర, పవర, చంద్రంపాలెం, వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. మిచాంగ్ తుపాన్ వల్ల వరి కోతలు, నూర్పిడి పనులకు అంతరాయం ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 35 బస్తాలకు మించి లేకపోగా ప్రస్తుత సీజన్‌లో 40 నుంచి 48 బస్తాల వరకు దిగుబడి రావడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. దీనికి తోడు ఆర్బీకేల్లో ధాన్యం విక్రయించిన నాలుగు రోజుల్లోనే బ్యాంకుల్లో పంట సొమ్ము జమ కావడంతో రైతులు మరింత ఆనందంతో ఉన్నారు. గోదావరి జలాలు సంమృద్ధిగా ఉండడంతో పొలాలను దమ్ములు చేసి వెదజల్లు పద్ధతిలో సాగుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31 నాటికి గోదావరి నీటిని ఆపేస్తామని అధికారులు ప్రకటించడంతో వెదజల్లు పద్ధతిలో తక్కువ కాలంలో దిగుబడి వచ్చే వరి విత్తనాలను వేసుకొంటున్నారు.



మేడపాడులో వెదజల్లు పద్ధతిలో మొలకలు వచ్చిన వరి చేను



పీబీ దేవంలో వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్న రైతు

వెదజల్లుతో ఖర్చు ఆదా



వెదజల్లు పద్ధతితోనే రైతులు మేలు జరుగుతుంది. ఖర్చు తగ్గుతుంది. రబీలో ఎక్కువ మంది వెదజల్లు పద్ధతికే ప్రాధాన్యం ఇస్తున్నారు. వరి కోత యంత్రాలను మరింత అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉంది. వ్యవసాయం పండగ అనేలా సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారు.

– మోరంపూడి రమేష్, రైతు, జి.మేడపాడు

కాలువలు మూసినా ఇబ్బంది ఉండదు



మండల పరిధిలోని 18 గ్రామాలతో పాటు మున్సిపాలిటీలో 22,300 ఎకరాలల్లో దాళ్వా వరి సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వేట్లపాలెం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు ప్రారంభించారు. మార్చి 31 నాటికి గోదావరి కాలువ మూసి వేసినా రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండదు. అప్పటికి పంట కోతకు సిద్ధమవుతుంది.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

తీరంలో పర్యాటకుల సందడి



కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్ర స్నానాలు చేశారు. యువకులు తీరంలో గుర్రపు స్వారీ, మోటార్ సైకిల్ ర్యాలీ, విన్యాసాలు చేశారు. తీరంలో వాలీబాల్, క్రికెట్ ఆడి కేరింతలు కొట్టారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా తీరంలో వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు మంచి నీరు అందుబాటులో లేక పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.



ఉప్పాడ సాగర తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు